# ఇన్ఫ్లుయెన్సు

రఘు క్రొత్తగా ఉద్యోగంలోకి ప్రవేశించిన రోజులవి. బి.యే, పరీక్షప్యాసైన చాలారోజుల తరువాత ఒక ఆఫీసులో టెంపరరీపోస్టు ఉందని తెలిస్తే అప్లైచేసేడు. పది రోజుల్లోనే అతనికి యింటర్వ్యూకి రమ్మని కబురురావటం. ఇంటర్వ్యూకి వచ్చిన ఐదుగురిలోనూ అతను సెలెక్టుకావటం జరిగింది. దానికి కారణం తనకున్న ఫస్టుక్లాసేనని ఎంతగానో గర్వపడ్డాడు రఘు.

ఐతే ఉద్యోగం ఆర్డర్సులో ఉన్నకొన్ని వాక్యాలతనిని తికమకపెట్టెయి. "ఈ ఉద్యోగం కేవలం తాత్కాలికమైనదే! ఏ రోజైనా ఏ క్షణంలోనైనా కారణాలు చెప్పకుండా, ముందుగా నోటీసుకూడా యివ్వకుండా యీ ఉద్యో

గంలోనుండి నీవు 'ఊష్ట్' చెయ్యబడవచ్చును. అన్నది ఆ వాక్యాలలోని సారాంశము.

అది చదువుతూనే ఆర్డర్సుకాగితాలు పట్టుకుని తమ పక్కింటి పరంధామయ్యగారింటికి పరుగుపెడ్తూ వెళ్ళేడు రఘు.

"ఇదేమిటండీ! ఏదో దొరక్క దొరక్క ఉద్యోగం దొరికిందని సంబరపడుతుంటే ఏ క్షణంలోనైనా ఊస్ట్ చెయ్య బడవచ్చునంటారేమిటి! ఖర్మ?" అన్నాడు రఘు కంగారుగా.

అతని కంగారుచూసి పెద్దపెట్టున నవ్వేరు పరంధా మయ్యగారు. "ఇంకా పాఠ్యగ్రంధాల తాలూకు పసితనం నీలోనుండి పోలేదోయ్ రఘూ! మరేం భయపడకు. ప్రభుత్వ కార్యాలయాల్లోని ఏ ఉద్యోగానికైనా ఆర్డర్లు అలాగే కొట్టిస్తారులే నీలాటివాళ్ళని భయపెట్టటానికి" "టెంపరరీ, టెంపరరీ" అంటూనే ఎన్నటికీ పర్మినెంటు కాకుండా పాతిక ముఫ్ఫైసంవత్సరాలదాకా టెంపరరీగానే పనిచేసి రిటైర్ అయ్యేవాళ్ళు చాలామంది ఉన్నారు. నామట్టుకు నా సంగతి చూడు, నేను ఉద్యోగంలోచేరి పదకొండున్నర సంవత్స రాలైంది. ఇంకా పర్మెనెంటు కాలేదు. ఇకముందు ఔతా దన్న నమ్మకంకూడా లేదు. నా ఉద్యోగం ఊడుతుందన్న భయం నా కంతకంటే లేదు. "అంటూ మరోసారి తుపాను గాలిలా పెద్దపెట్టున నవ్వేడు పరంధామయ్యగారు.

తన ఉద్యోగ జీవితంలో యిది మొదటిపాఠం కాబోలు

ననుకుంటూ ఇంటికి తిరిగి వెళ్ళేడు రఘు. మర్నాడు ఉదయమే ఆఫీసులోకి ప్రవేశించేడు. ఆఫీసుపని నేర్చుకోవటం ఏమంత కష్టమనిపించలేదు రఘుకి. ఐనా ఏమైనా పని ఉంటేగా, చెయ్యటానికి? ఉన్న కాస్తపనినీ నెలల తరబడి పేరపెట్టి ఎప్పుడో అవసరమొచ్చినప్పుడు మాత్రం చేస్తారు అంతే!

రఘు చిన్నతనంనుండి కథలు, నవలలు చదివి గుమాస్తాలమీద గంపెడు సానుభూతిని, బండెడు జాలినీ పెంచుకున్నారు. రచయితల కలాలద్వారా వెలువడిన గుమాస్తాలనగానే ఎముకలు బయటపడేలా బక్కచిక్కిన శరీరంతో తైల సంస్కారంలేని జుట్టుతో ముఖంతో నిరాశ నిస్పృహలు తాండవం చేస్తుండగా, యింట్లో పాలకోసం ఏడ్చే పసిపిల్లలను, యింటిముందు యమకింకరుల్లా నిలబడిన అప్పుల వాళ్ళను తలచుకుని కుమిలిపోతు ఫైళ్ళమధ్య తలదూర్చి రాత్రింబవళ్ళు ఆఫీసుపనిలో సతమతమయ్యే జీవాలు రఘు. ముందు కదలాడేవి.

కాని యీ ఆఫీసులో అలాంటి జీవాలేమీ కంటబడలేదు. అది నిజంగా పెద్ద 'షాక్'లా తగిలింది రఘుకి. ఈ ఆఫీసులో పనిచేసే గుమాస్తాలందరూ టెర్లిన్ బట్టలు లేదా కనీసం కాటన్ నైనా శుభ్రమైన బట్టలుకట్టుకొని సైలా పచ్చేసుగా నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ గంటకోసారి టీ త్రాగుతూ కులాసాగా తిరుగుతుంటారు. చీకూ చింతా అనేవి

వాళ్ళముఖాల్లో ఏ కోశానా కనపడవు. ఒకవేళ అలాంటి వేమైనా ఉన్నవాటిని బయటకు కనపడనీయరు.

అందువల్ల ఆఫీసులో పనిచేసే తనబోటి గుమాస్తాలను చూసిన తరువాత వాళ్ళనుగురించి అంతకుముందు తనలో వేరొకరకమైన చిత్రాలను ముద్రించిన రచయితలమీద చాలా కోపం వచ్చింది రఘుకి. "ఈ రచయితలందరూ పట్టి అబద్ధాలకోర్లు కోతలరాయుళ్లు" అనుకున్నాడు రఘు.

ఆ ఆఫీసుగురించి అతనికి తెలిసిన మరో ముఖ్యమైన విషయం మేమంటే అక్కడ పనిచేసేవాళ్ళంతా పేరుకు గుమాస్తాలే అయినా ప్రతివాడూ ప్రధానమంత్రిలా పోజు పెట్టేవాడే! ఐతే ఆ ఫోజులలోకూడా "గ్రేడ్స్" ఉన్నట్లు కనిపెట్టేడు రఘు. ఆ పోజుల తాలూకు చరిత్ర కొంతకాలం పోయిన తరువాతగాని అర్థంకాలేదు అతనికి. ఓసారి రఘు తనతోటి ఉద్యోగస్తుడైన సుబ్బారావుతో కాంటీన్‌లో టీ త్రాగుతుండగా అతను "అన్నట్లు నువ్వు ఎవరి కాండిడేట్ వోయ్" అనడిగేడు.

సుబ్బారావడిగిన దేమిటో అర్థం కానేలేదు రఘుకి. "ఏమిటండీ మీరనేది?" అన్నాడు.

"అదేనోయ్! నువ్వు ఎవరి కాండిడేట్‌వి అంట!" అన్నాడు "చాయ్" చప్పరిస్తూ సుబ్బారావు.

"నేనెవరినో కాండిడేట్ నవటమేమిటండీ? ఏమైనా ఎలక్షన్సుగూర్చి మాట్లాడుతున్నారేమిటి?" అన్నాడు అయోమయంగా రఘు.

టీ త్రాగటం ఆపి అతనివంక చిత్రంగా చూసేడు సుబ్బారావు. "మీరు వట్టి అమాయకుల్లా వున్నారు సార్! మీరు ఎవరి రికమెండేషన్ వల్ల యీ ఉద్యోగం వచ్చింది అని అడుగుతున్నాను. నేను ఫుడ్ మినిష్టర్ కాండిడేట్‌ని లెండి" అన్నాడు షర్టు కాలరు కొంచం పైకి సర్దుకొంటూ. అప్పటికి అర్థమయింది రఘుకి. "అదా! నేను ఎవరి యిన్ఫ్లూయెన్సువల్లను యీ ఉద్యోగంలోకి చేరలేదండీ! పేపర్లో ఎడ్వర్‌టైజ్‌మెంట్ చూసి ఎప్లయి చేసేను. ఉద్యోగం వచ్చింది" అన్నాడు.

"ఏమిటి మీరనేది? రికమెండేషన్ లేకుండానే మీకీ ఉద్యోగం వచ్చిందా? యింపాజిబుల్! అన్ బిలీవబుల్" అంటూ బల్లగుద్దేడు సుబ్బారావ్.

"మరీ బల్లనంత గట్టిగా కొట్టకండి. విరిగిపోతుందేమో! అసలే మీరు ఫుడ్ మినిష్టర్ కాండిడేట్ కూడాను" అంటూ లేచేడు రఘు.

సుబ్బారావు ఓసారి తన స్థూలకాయంవంక చూసుకొని, తరువాత రఘువంక కొరకొరచూసి అతనికంటె వేగంగా

నడచి ఆఫీసుకి వెళ్ళిపోయేటప్పుడే తెలిసింది రఘుకి. తన కైతే ఏదో అదృష్టవశాత్తూ ఉద్యోగం దొరికిందికాని, యీ ఆఫీసులో పనిచేసే ఉద్యోగస్తులందరికీ ఏదో ఇన్ఫ్లూయెన్సు చెయ్యందే ఉద్యోగాలు దొరకలేదని అర్థమయింది ఆ యిన్ఫ్లూయెన్సు కొంత ఏ వ్యక్తినుండి వచ్చిందో ఆ వ్యక్తియొక్క హోదానుబట్టి వారితాలూకు గుమాస్తాలుకూడా ప్రవర్తిస్తుంటారు.

అందులో ఒకతను ఎడ్యుకేషన్ మినిష్టర్ కాండిడేట్ట. అందువల్ల మిగతా ఉద్యోగస్తులందరూ సాక్షాత్తూ ఎడ్యుకేషన్ మినిష్టర్ గానే భావించి గౌరవిస్తుంటారు. అది చూసి ఆ ఉద్యోగి ఆఫీసర్నికూడా లక్ష్యపెట్టకుండా తిరుగుతాడు.

ఒకరోజు రఘు సెక్షన్లోకి మరొక సెక్షనులో పని చేసే స్త్రీ వచ్చింది. ఆమె ఆరడుగుల పొత్తు, అంతకుతగ్గ లావుగలిగి, స్టైయిలిష్గా అలంకరించుకుని, ఠీవిగా గదిలోకి ప్రవేశించింది. ఆమెను చూస్తూనే ఆ రూములో ఉన్న వాళ్ళంతా ఒక్కసారి లేచి నిలబడ్డారు. "మిసెస్ ఠాకూర్ వస్తోంది. మిసెస్ ఠాకూర్ వస్తూంది" అంటూ గుసగుసలు వినిపించేయి.

"ఏమిటిలా వేంచేసేరు ?" వినయంగా అడిగాడొకాయన.

"కాఫీ తెప్పించమంటారా? కోకోకోలా కావాలంటారా?" మరొకాయన, అభ్యర్థిస్తున్నట్లు ప్రశ్న. చివరికి పదిహేను నిముషాలు కూర్చుని, కోకోకోలా త్రాగి ఆమె వెళ్ళేక రఘు ప్రక్కనే ఉన్న టైపిస్టుని "ఆవిడ ఎవరి కాండి డేటండీ! అంత గౌరవిస్తున్నారు?" అనడిగేడు.

"ఆవిడా! ఆవిడకేమండీ? మన డైరెక్టరుగారిదగ్గర ఆవిడకు మంచి యిన్ఫ్లూయెన్సు ఉందండీ? మన డైరెక్టరు గారికి ఏదో రిలేషన్ ఉందిట. అందుకే అంతా ఆవిడను ఎంతగానో గౌరవిస్తారు. ఆవిడకు కొంచెం అమర్యాద జరిగితే చాలు వెంటనే డైరెక్టరుగారితో చెప్పేస్తుంది. "అన్నాడు అలా అంటుంటే అతని కంఠంలో తొణికిసలాడిన భక్తిశ్రద్ధలను స్పష్టంగా గ్రహించిన రఘు" మరి ఆవిడ పేరు మిసెస్ ఠాకూర్ అంటున్నారు. మన డైరెక్టర్ తెలుగాయన కదా! వాళ్ళిద్దరికీ చుట్టరికం ఎలా కలిగిందండీ?" అనడిగాడు.

"చుట్టరికం ఉందని యిప్పుడు నీతో ఎవరన్నారండీ?" అన్నాడు విసుగ్గా టైపిస్ట్.

"ఇప్పుడేగదండీ మీరన్నారు. డైరెక్టర్ గారితో ఏదో రిలేషన్ ఉందనీ..."

అతనింకా వాక్యం పూర్తి చెయ్యకుండానే కొడుతున్న టైపుమిషన్ ఆపేసి పెద్దగా నవ్వేడు టైపిస్టు. "రిలేషన్,

అన్న పదానికి మీరు తీసుకున్న అర్థం అదా అండీ! ఎంత పిచ్చివారండీ మీరు? అసలు మీరీ కలియుగంలో పుట్టవలసిన వారు కారు" అన్నాడు.

ఆ సమయంలో రఘుకి ఆ టైపిస్టుమీద, మిసెస్ ఠాకూర్ మీద, డైరెక్టరుమీదనేకాదు, సమస్త ప్రపంచం మీదా అసహ్యం పుట్టింది.

మిసెస్ ఠాకూర్ కేకాక చాలామంది మగగుమాస్తాల యిన్ఫ్లూయెన్సు కూడా చిత్రమైన "రిలేషన్స్"వల్ల కలిగి నట్లు ఆ తరువాత తెలిసింది రఘుకి. ఒకాయన మేనత్తకి ఒక ఆఫీసర్ దగ్గర మంచి యిన్ఫ్లూయెన్సు ఉందిట. అందువల్ల అతనికి బియే పరీక్షాఫలితాలు తెలియకముందే ఉద్యోగం వచ్చేసిందట. అసలు యీ రోజులలో యువకులందరూకూడ మంచి యిన్ఫ్లూయెన్సుఉన్న మామలను చూసి మరీ పెళ్ళి చేసుకుంటున్నారట. ఈ సంగతులన్నీ చెవిక్రింద జోరీగలా టైపిస్టు చెప్పుకుపోతుంటే రఘు పరధ్యానంగా విన్నాడు.

రఘు ఆఫీసులో పనిచేసింది నాలుగునెలలు ఆ నాలుగు నెలలలోను తెలుసుకొన్న ముఖ్యమైన విషయమేమంటే భూమి గుండ్రంగా ఉన్నది అన్నది అన్న విషయం ఎంత సత్యమోయీపవిత్రభారతదేశంలోయిన్ఫ్లూయెన్సులేకుండా ఉద్యోగం లభించటంకాని, అథవా లభించినా నిలబెట్టుకోవడం గాని అసాధ్యమన్న విషయంకూడ అంత గొప్పసత్యమేననీ,

ఆ ఆఫీసులో రఘుతోపాటు మెరిట్ వల్లనో అదృష్టంకల సొచ్చీ ఉద్యోగం లభించినవారు నలుగురైదుగురు ఉన్నారు. వాళ్ళని మిగతావాళ్ళంతా ఎంతో సానుభూతిగా, చులకనగా చూసేవాళ్ళు.

కిండర్ గార్డెన్ స్కూలులోని పిల్లలు సీట్లదగ్గరనుండీ సాహిత్య బహుమతులవరకు ఎక్కడచూసినా యిన్ ఫ్లూయెన్సు ధనికవర్గాలద్వారా, అధికారవర్గాలద్వారా లేదా పేరుప్రతిష్టలుగల నాయకులద్వారా ఏ రకంగానైనా కావచ్చు.

ఇదంతా చూసేక రఘుకి తన ఉద్యోగం ఏక్షణాన ఊడుతుందోనన్న భయం పట్టుకుంది. పరంధామయ్యగారి రోజులే కాస్తనయం. టెంపరరీయో, పర్మనెంటో ఏదో ఒకటి ఉద్యోగమన్నా ఉండేది. ఇప్పుడీ వాతావరణం చూస్తుంటే ఉద్యోగం నిలకడగా ఉంటుందన్న నమ్మకంకూడా లేదు. ఇలాంటి భయాందోళనలతో సతమతమవుతుండగా రఘు తండ్రి హఠాత్తుగా గుండెజబ్బులవల్ల మరణించేడు. దాంతో నెలనెలా ఆయన సంపాదించే రెండువందల యాభై రూపాయలు ఆదాయం ఆగిపోయింది. ఇంటికి రఘే పెద్ద కొడుకు. తల్లిని యిద్దరు తమ్ముళ్ళను ముగ్గురు చెల్లెళ్ళను తనకువచ్చే నూట డెబ్బయి రూపాయలతో ఎలా పోషించాలో అతనికి తెలియటంలేదు, తన స్థితిని చూస్తుంటే రఘుకి చిన్నతనంలో తను నవల్లోను, కథలలోను చదివిన జీవాలు గుర్తుకు వచ్చినయ్ భగవాన్! తనుకూడా అలాగే బక్కచిక్కిన

శరీరంలో, మొఖంలో నిరాశా నిస్పృహాలు తాండవ చేస్తుండగా ఫైళ్ళమధ్య తలదూర్చి......!! అతని ఆలోచనలకు బ్రేక్ వేస్తూ, తోటి ఉద్యోగస్థుల కలకలంమధ్య అతనిచేతికి ఊస్టింగ్ ఆర్డర్సు యిచ్చేడు ఫ్యూన్.

అవి చూస్తేనే రఘుకి కళ్ళుచీకట్లు క్రమ్మినయ్. శరీరం వశం తప్పిపోయినట్లయింది. ఆ అయోమయంలోనే ఓ...వాక్యం అతని చెవులనుండి గుండెల్లోకి బలంగా దూసుకుంటూ వచ్చింది. "రఘుగారి ప్లేస్‌లో వచ్చే ఆయన లేబర్ మినిష్టర్‌గారి కాండిడేట్‌ట.